
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 16 డిసెంబరు 2024 | 5



శ్రీలలిత రైస్ ఇండస్ట్రీస్‌లో కొనసాగిన ఐటీ దాడులు 7

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక 7



పోలవరానికి సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.45గంటలకు పోలవరం ప్రాజెక్టు వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ఆయనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. 10.50 గంటలకు బయల్దేరి పోలవరం ప్రాజెక్టు సైట్‌లోకి వెళతారు. 12.05 గంటల వరకు గ్యాప్-1, వైబ్రో కాంపాక్షన్, గ్యాప్-2 పనులను పరిశీలించి డయాఫ్రంవాల్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయల్దేరి 12.20 గంటలకు పోలవరం గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 12.50 గంటల వరకు పోలవరం ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ పరిస్థితిపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటల వరకు మీడియా సమావేశం నిర్వహిస్తారు. 1.25 గంటలకు హెలికాప్టర్లో బయల్దేరి 2.15 గంటలకు వెలగపూడిలోని సెక్రటేరియట్‌కు చేరుకుంటారు.

ఇక్కడి నుంచే షెడ్యూల్ ప్రకటన?

ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి అవసరమైన షెడ్యూల్‌ను చంద్రబాబు ఇక్కడి నుంచే ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో సీఎం హోదాలో చంద్రబాబు పోలవరం పనులను పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. ప్రతి సోమవారం పోలవరం వచ్చేవారు. 2019కి సుమారు 72 శాతం పనులు పూర్తి చేయించారు. స్పిల్‌వే గేట్లు కూడా పెట్టి ఒక కొలిక్కి తెచ్చారు. ఎగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రంవాల్‌లను నిర్మించారు. దిగువ కాఫర్ డ్యాం పనులు మొదలుపెట్టారు. కుడి ప్రధాన కాలువ పనులను ఒక కొలిక్కి తేగా, ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. మరోపక్క పోలవరం విద్యుత్ ప్రాజెక్టు పనులను కూడా మొదలు పెట్టించారు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్, ఎంక్వయిరీలు అంటూ జాప్యం చేసి, చివరకు ప్రాజెక్టును కదలకుండా చేసిన సంగతి తెలిసిందే.

● (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

ఉదయం 10.50 గంటలకు పోలవరం సందర్శనకు సీఎం చంద్రబాబు
ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణపై సమీక్ష

కూటమి రాకతో..చిగురించిన ఆశలు

2019కు ముందు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకులను రప్పించి ప్రాజెక్టు పనులు చూపించారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం మీడియా కూడా పోలవరం ప్రాజెక్టు చూడ్డానికి వెళ్తే అనేక నిబంధనలు విధించేవారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి భారీ మెజార్టీతో అధికారం లోకి రావడంతో పాటు తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. కేంద్రం కూడా తోడవ్వడంతో ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది.

వైసీపీ హయాంలో అస్తవ్యస్తం

వైసీపీ హయాంలో ఏమి జరిగిందో కానీ డయాఫ్రంవాల్ దెబ్బతింది. ఇవాళ దీనికి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. గతనెలలో నిపుణుల కమిటీ పర్యటించి డయాఫ్రంవాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అమెరికా, కెనడా నిపుణులతో కలసి పీపీఏ, సీడబ్ల్యూసీ, జలవనరుల శాఖ అధికారులు, ఇతర నిపుణులు కలిసి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న డయాఫ్రంవాల్‌కు సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రంవాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణం, డిజైన్లు, మెటీరియల్ ఏమి వాడాలి, టెస్ట్‌లు ఎలా చేయాలనే దానిపై పోలవరం ప్రాజెక్టు వద్ద వర్క్ షాపు నిర్వహించిన సంగతి తెలిసిందే. చివరిరోజు రాజమహేంద్రవరంలోని మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో నిపుణుల కమిటీ ఫైనల్ మీటింగ్ జరిగింది. సుమారు 4గంటల సమయం పాటు అక్కడ నిపుణులు, అధికారులు, కాంట్రాక్టర్, కన్సల్టెన్సీ నిపుణులు చర్చించారు. ప్రస్తుతం ఉన్న డయాఫ్రంవాల్‌కు 6 మీటర్ల దూరం నుంచి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. దీని డిజైన్లు, వాడవలసిన మెటీరియల్స్, వాటి నాణ్యత ఎలా ఉండాలి. ఎటువంటి టెస్ట్‌లు నిర్వహించాలనే అంశంపై చర్చ జరిగింది. అఫ్రీ కన్సల్టెన్సీ డిజైన్, మెటీరియల్స్ నాణ్యత వివరాలపైనా చర్చించారు. డయాఫ్రంవాల్ పనులు జనవరి నుంచి మొదలు కానున్నాయి. పనుల షెడ్యూలును చంద్రబాబు స్వయంగా ఇక్కడే ప్రకటించే అవకాశం ఉంది. డయాఫ్రంవాల్ పనులు మొదలెట్టిన తర్వాత ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ పనులు మొదలుపెట్టి 2027కు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్లనున్నారు.



బియ్యం తరలింపుపై.. 24 గంటల నిఘా


చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బంది

- రెండు పోర్టుల్లో మూడు చెక్‌పోస్టులు
- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- తొలుత కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఏర్పాటు
- తాజాగా కాకినాడ సీపోర్టులో ఏర్పాటు
- నిరంతర తనిఖీలతో బెంబేలెత్తుతున్న అక్రమార్కులు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఉన్న రెండు పోర్టుల్లో మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను నియంత్రించడానికి ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

కాకినాడలో ఉన్న యాంకరేజ్ పోర్టు ద్వారా పీడీఎస్ బియ్యం పెద్దఎత్తున అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. తొలుత ఈ ఏడాది జూన్ 28, 29 తేదీల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో గోదాముల్లో తనిఖీ చేశారు. అప్పట్లో 26వేల మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. తర్వాత జూలై నెలలో కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద బొంబాయి కాటా గేటు వద్ద ఒకటి, శక్తిగేట్ వద్ద, మరొకటి చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, సివిల్ సప్లయిస్, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద లోడింగ్‌కు పది నౌకల వరకు ఉంటే తర్వాత కాకినాడ సీపోర్టు నుంచి బియ్యంలోడ్ చేయవచ్చునని గత ప్రభుత్వంలో ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇటీవల కాకినాడ సీపోర్టులో కూడా విదేశాలకు వెళ్లే నౌకల్లో బియ్యం లోడింగ్ జరుగుతోంది. ఇది గుర్తించిన అధికార యంత్రాంగం సీపోర్టు(కేఎస్పీఎల్) వద్ద మూడో చెక్‌పోస్టును శనివారం నుంచి ప్రారంభించింది. ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి ప్రసన్నలక్ష్మీదేవి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, సీఎస్‌డీటీలు విజయ్‌కుమార్, శ్రీనివాస్ సీపోర్టు చెక్‌పోస్టువద్ద శనివారం తనిఖీలు చేశారు. చెక్‌పోస్టులో సిబ్బందికి తనిఖీలపై దిశా నిర్దేశం చేశారు. మూడు షిఫ్ట్‌ల్లో పనిచేయాలని ఆదేశించారు.

శాంపిల్స్ ల్యాబ్‌కు..

మూడు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేసి తీసిన శాంపిల్స్‌ను ఏ రోజుకారోజు పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ల్యాబ్‌లో పరీక్ష నిమిత్తం పంపిస్తున్నారు. రారైస్, బ్రోకెన్ రైస్‌ల్లో పీడీఎస్ ఆనవాళ్లను గుర్తించేందుకు శాంపిల్స్ సేకరిస్తున్నారు. ఎగుమతి చేస్తున్న రైస్‌లో కెర్నెల్స్ ఉన్నాయా లేదా అనే అంశంపై తనిఖీలు జరుగుతున్నాయి.

కాకినాడ సీపోర్టులో తనిఖీలు

- పీడీఎస్ బియ్యం నిల్వల సమాచారంతో జేసీ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు
- 146 కంటైనర్లలో ఉన్న బియ్యం తనిఖీలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టులో 146 కంటైనర్లలో పీడీఎస్ బియ్యం ఉన్నాయనే సమాచారంతో కాకినాడ జేసీ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో బృందం ఆదివారం ఆకస్మికంగా దాడులు చేశారు. సీపోర్టులో ఎగుమతులకు సిద్ధంగా ఉన్న కంటైనర్లను తెరిచి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అక్కడికక్కడే శాంపిల్స్ సేకరించి పరీక్షించారు. పోర్టులో ప్రధానంగా ఉషశ్రీ ట్రేడర్స్‌కు చెందిన స్టఫ్డ్ రైస్ కంటైనర్లనుంచి బృందం బియ్యం శాంపిల్స్ తీశారు. పరీక్షించిన అనంతరం పోర్టి ఫైడ్‌రైస్ కెర్నెల్స్ లేనందున పీడీఎస్ బియ్యం కాదని నిర్ధారించారు. కాకినాడయాంకరేజ్ పోర్టులో బియ్యం లోడింగ్‌కు 13భారీ నౌకలు నిరీక్షించడంతో సీ పోర్టునుంచి బియ్యం లోడింగ్‌కు అనుమతి లభించింది. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం లోడింగ్ కోసం పది నౌకలకు మించి లంగర్ వేస్తే తర్వాత వచ్చే నౌకలకు సీపోర్టులో లోడింగ్ చేయాలని గతప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం కాకినాడ సీపోర్టు(డీప్ వాటర్ పోర్టు)లో లోడింగ్‌కు బియ్యం సిద్ధం చేశారు. అధికారుల బృందం ఉదయం 9గంటల నుంచి దాడులు నిర్వహించి తనిఖీలు చేశారు.

చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా

కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్‌వాటర్ పోర్టులో మొత్తం మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 24గంటలపాటు మూడు షిఫ్ట్‌ల్లో రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయిస్ అధికారులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. రారైస్, బ్రోకెన్ రైస్‌లో శాంపిల్స్ తీసి ల్యాబ్‌లో పరీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం జేసీ రాహుల్‌మీనా విలేకర్లతో మాట్లాడుతూ చెక్‌పోస్టులవద్ద నిత్యం తనిఖీలు జరుగుతున్నాయన్నారు. తనిఖీల తర్వాత మాత్రమే వాహనాలకు గేట్‌పాసు ఇస్తారన్నారు. తనిఖీల్లో కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, ఇన్‌చార్జి పౌరసరఫరాలశాఖ అధికారిణి ప్రసన్నలక్ష్మీదేవి పాల్గొన్నారు.


సీపోర్టులో బియ్యం తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్

శెట్టిబలిజ కులాల అభివృద్ధికి.. కూటమి ప్రభుత్వం 'వెన్నుదన్ను'


ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

- మంత్రులు సుభాష్, దుర్గేష్
- కార్పొరేషన్ చైర్మన్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించిన రెడ్డి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం 'వెన్నుదన్ను'గా నిలుస్తోందని మంత్రులు సుభాష్, దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్‌లో శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. రాత్రి జరిగిన వెన్నుదన్ను సభలో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు, 15మంది సభ్యులతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు. సభలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి సుభాష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి సహా పలువురు ప్రసంగించారు. పూర్తి వివరాలు.. 7లో..

వేట్లపాలెం.. రక్తసిక్తం


సంఘటనా ప్రాంతంలోనే దాడికి ఉపయోగించిన కత్తి

- ఇంటి సరిహద్దు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం
- కత్తులు, గొడ్డళ్లతో ఒక వర్గంపై మరొక వర్గం దాడి
- సామర్లకోట మండలం వేట్లపాలెం శివారులో ఘటన
- ముగ్గురు మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు

వేట్లపాలెం రక్తసిక్తమైంది.. ఇంటి స్థలం సరిహద్దు వివాదం.. పెను విషాదానికి దారి తీసింది. ఒక వర్గం మరొక వర్గంపై చేసి దారుణ దాడిలో మూడు నిండు ప్రాణాలు బలవ్వగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ శివారులోని దళిత చెరువు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ దారుణం జరిగింది.

పూర్తి వివరాలు.. 7లో..


సంఘటనాస్థలం వద్ద కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్

పొట్టిశ్రీరాములు త్యాగఫలమే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం


పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- ఆత్మార్పణ దినంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు నిరుపమాన త్యాగఫలమే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రంగా సిద్ధించిందని, ఆయన నిస్వార్థ ఆత్మార్పణకు తెలుగు ప్రజలందరూ సదా కృతజ్ఞతాబద్ధులై ఉండాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సీబీఎం స్కూల్‌రోడ్డు, ఫెల్‌షిప్ చర్చ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఆత్మార్పణ దినం పాటిస్తూ జిల్లాస్థాయి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు అలంకరించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ మూలపురుషుడు పొట్టిశ్రీరాములు తెలుగువారందరికీ ప్రాతఃస్మరణీయుడు, చిరస్మరణీయుడు అని కొనియాడారు. ఆయన పట్టుదల, కృషి త్యాగాల ఫలితంగానే తెలుగుభాష మాట్లాడే ప్రజలు ఆత్మగౌరవంతో పురోగమించేందుకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ కమిషనర్ భావన, బీసీ సంక్షేమశాఖ అధికారి లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, యువజన సర్వీసులశాఖ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనా ఆదివారం పొట్టిశ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. డివిజన్‌స్థాయిలో పిఠాపురంలో రథాలపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జరుగుతుందని, తాను ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నానని చెప్పారు. ఈ మేరకు అధికారులందరూ విధిగా హాజరు కావాలన్నారు.

మెయిన్‌లో.. కౌడా చైర్మన్ ప్రమాణస్వీకారంలో అపశృతి

- జనం పెరగడంతో ఒక్కసారిగా కూలిపోయిన స్టేజీ
- గాయపడిన పలువురు కూటమి నాయకులు


స్టేజీ కూలిపోవడంతో ఒక్కసారిగా ఏర్పడిన గందరగోళ పరిస్థితి

మెట్టుమెట్టుకు పూజలు 7

- సత్యదేవుడి సన్నిధిలో వేడుకగా మెట్లోత్సవం
- పసుపు, కుంకుమలు పూసేందుకు తరలివచ్చిన మహిళలు
- ఆలయ సిబ్బందితో నూతన ఈవో సమీక్ష సమావేశం
- భక్తులతో కిక్కిరిసిన రత్నగిరి

పృచ్ఛకుల ప్రశ్నలు.. చమత్కారంగా సమాధానాలు 7

- పిఠాపురంలో భగవద్గీతపై అష్టావధానం

పాపికొండలకు బ్రేక్.. మళ్లీ అనుమతులు! 7

గీత కులాలకు కూటమి అధిక ప్రాధాన్యం

» మంత్రి వాసంశెట్టి సుభాష్ » రాజమహేంద్రవరంలో శెట్టిబలిజ వెన్నుదన్ను సభ » పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు


శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణం చేయిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం, పాల్గొన్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గీత కులాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధిక ప్రాధాన్యమిచ్చారని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తూర్పు గోదావరి రాజమహేంద్రవరం లాలాచెరువులో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, 15 మంది డైరెక్టర్ల ప్రమాణస్వీకారోత్సవం, శెట్టిబలిజ వెన్నుదన్ను సభ శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్) అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. కుడుపూడి సత్తిబాబు, 15మంది డైరెక్టర్‌లతో ఆర్ఎస్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శెట్టిబలిజ జాతి పిత దొమ్మేటి వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్‌లో ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందని, వేమగిరి సెంటర్లో కూడా దొమ్మేటి విగ్రహాన్ని పెట్టుకుంటామన్నారు. గీత కులాలకు కూటమి ప్రభుత్వ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 5నెలలోనే లిక్కర్ పాలసీలో 10శాతం రాయితీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం శెట్టిబలిజ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తే చంద్రబాబు సీఎం అయ్యాక కార్పొరేషన్లను బలోపేతం చేసి నిధుల కేటాయింపులు చేస్తున్నారన్నారు. శెట్టిబలిజలను తెలంగాణలో ఓసీలుగా పరిగణిస్తున్న తరుణంలో తమ సీఎం చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.

శెట్టిబలిజల అభివృద్ధికి కృషి : దుర్గేష్

మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ శెట్టిబలిజల అభివృద్ధికి చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయంగా కొంతమందికి అవకాశాలు వస్తాయని, కుడుపూడి సత్తిబాబు, డైరెక్టర్లు జాతి ప్రయోజనం కోసం కృషి చేయాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అమరావతిని, పోలవరాన్ని చంద్రబాబు కచ్చితంగా పూర్తి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఇటు పార్టీ కార్యక్రమాల్లో, అటు జాతి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ కుడుపూడి చేసిన కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించి గీత కులాలకు అనాడే ఎన్టీఆర్ ప్రాధాన్యత ఇచ్చారని దానిని సీఎం చంద్రబాబు ముందుకు తీసుకెళ్లి మరింతగా అభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. తెలంగాణ శెట్టిబలిజ సంఘం నేతలు జయప్రకాష్‌నారాయణ, కొప్పి శెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణలో ఓసీలుగా ఉన్న శెట్టిబలిజలను బీసీలుగా మార్పించడంలో కూటమి ప్రభుత్వం చొరవచూపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు-విధులు లేకుండా నిర్వీర్యం చేస్తే చంద్రబాబు తగిన ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ గౌడ, శ్రీశ యన, యాత కులాల అభివృద్ధికి పాటుపడింది టీడీపీయే అని గుర్తు చేశారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గజమాలతో శెట్టిబలిజ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సభలో టీడీపీ నేతలు యర్రా వేణుగోపాలరాయుడు, పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బుడ్డిగ రవి, కడలి రామకృష్ణ, పిల్లి శ్యామ్, సింహా నాగమణి తదితరులు పాల్గొన్నారు.


సభలో పాల్గొన్న శెట్టిబలిజలు

వేట్లపాలెం... రక్తసిక్తం


ముగ్గురి హత్యకు దారి తీసిన ఇల్లు

» ముగ్గురు మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు
» ఇంటి సరిహద్దు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం
» కత్తులు, గొడ్డళ్లతో ఒక వర్గంపై మరొక వర్గం దాడి
» సామర్లకోట మండలం వేట్లపాలెం శివారులో ఘటన

సామర్లకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం సరిహద్దు వివాదంలో ఇరు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు ముగ్గురు వ్యక్తుల దారుణ హత్యకు దారి తీసింది. మరో ఏడుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఇంటి నిర్మాణం వద్ద జరిగింది. ఘర్షణలకు దారి తీసిన ఇరువర్గాలూ ఒకే సామాజిక వర్గానికి చెందిన దళితులు కావడం గమనార్హం. గ్రామ శివారులో దళిత చెరువును ఆక్రమించి కార్ధాల కుటుంబానికి చెందిన వ్యక్తులు ఇల్లు నిర్మిస్తున్నారని సమీపంలోనే ఉంటున్న బచ్చల కుటుంబానికి చెందిన వారు గ్రామ పంచాయతీలో ఫిర్యాదులు చేశారు. ఈ వివాదం ఆ 2 కుటుంబాల మధ్య 3నెలలుగా నడుస్తోంది. గ్రామ పెద్దల మధ్య కూడా పలు దఫాలు చర్చలు నిర్వహించారు. అయితే కార్ధాల కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆదివారం ఇంటి నిర్మాణంలో భాగంగా సుమారు 15మంది కూలీలతో కలిసి శ్లాబ్ వేస్తుండగా ఇదే అదనుగా చూసుకుని బచ్చల కుటుంబానికి చెందిన వ్యక్తులు సుమారు పది మంది మూకుమ్మడిగా కత్తులు, ఇనుపరాడ్‌లతో ఒక్కసారిగా దాడులు చేసి విచక్షణ రహితంగా నరికారు. దీంతో కార్ధాల ప్రకాశరావు(55) సంఘటనా స్థలిలోనే తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన వారిని ప్రైవేట్ అంబులెన్స్‌లో సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కార్ధాల చంద్రరావు(60) మృతిచెందాడు. ఉన్నత చికిత్స నిమిత్తం మిగిలిన వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కార్ధాల ఏసుబాబు(45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కార్ధాల పండు, కార్ధాల దావీదు, కార్ధాల బాబీ, కార్ధాల చిన్నోడు, కార్ధాల సత్యవేణి, కార్ధాల అచ్చియ్య, కార్ధాల సంజీవరావులు ఉన్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల ద్వారా సామర్ల కోట పోలీసులకు తెలిసింది.

కాగా ఈ దాడులకు పాల్పడిన వారిగా బచ్చల సుబ్బారావు, బచ్చల జకరయ్య, బచ్చల బిళ్ళప్పి, బచ్చల మోషే, బచ్చల భాగ్యవతిలను పోలీసులు ప్రాథమికంగా గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనా సమాచారం అందిన వెంటనే పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ శ్రీ కృష్ణభగవాన్ తదితర పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేరుకుని ఘర్షణలకు దారి తీసిన పరిస్థితులపై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి గురించి ఆరా తీశారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.


సంఘటనా స్థలంలో మృతిచెందిన ప్రకాశరావు

పోలీసుల విఫలం!

ఇదిలా ఉండగా 2 కుటుంబాల మధ్య వివాదం గత 3 నెలలుగా పంచాయతీలో ఫిర్యాదులు పరంపరగా నడుస్తుండడం, గ్రామ పెద్దల మధ్య రాజీ చర్చలు నిర్వహించడం వంటి కీలక సమాచారాన్ని సేకరించడంలో పోలీసు వర్గాలే కాదు ఇంటిలిజెన్స్ వర్గాలు సైతం విఫలం కావడం వల్లే రెండు కుటుంబాల మధ్య కత్తులతో దాడులు, ముగ్గురి హత్యకు దారితీసిందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో 2018లో ఇదే ప్రాంతంలో దళితులకు, దళితులేతరులకు పట్టాలుగా దళిత చెరువులో అప్పట్లో వివాదం చెలరేగి 15 ఇళ్లు తగులబెట్టిన విషయం విదితమే.


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పండు, సంజీవరావు


కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి ప్రమాణ స్వీకారంలో ప్రసంగిస్తున్న మంత్రి దుర్గేష్

కౌడా చైర్మన్ తుమ్మల ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డవలెప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం కాకినాడలోని ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి కం దుల దుర్గేష్ మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కౌడా నిధులతో మరింత అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రామస్వామి సేవలకు గుర్తింపుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మక కౌడా చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. రామస్వామి మాట్లాడుతూ కౌడా నిధులతో బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియాన్ని జనవరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కౌడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి కి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు య నమల రామకృష్ణుడు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, వనమాడి కొండబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ హరిప్రసాద్, టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు జ్యోతులనవీన్, చిలుకూరి రామ్‌కుమార్, డిడ్కో చైర్మన్ వి.అజయ్, సివిల్ సరఫరా చైర్మన్ తోట సుధీర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెట్టు మెట్టుకు పూజలు

● సత్యదేవుడి సన్నిధిలో వేడుకగా మెట్లోత్సవం
● పసుపు, కుంకుమలు పూసేందుకు తరలివచ్చిన మహిళలు



సత్యదేవుని సన్నిధిలో పోటాపోటీగా మెట్లకు పసుపు, కుంకుమలు పూస్తున్న మహిళలు, పల్లకీలో పూజలందుకున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం మెట్లోత్సవ కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. ఉదయం 7 గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో కొండదిగువకు తీసుకునివచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. 9.30కి తొలిపావంచా వద్ద పల్లకీలో స్వామి,అమ్మవార్లకు ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారి అష్టోత్తరశతనామాలతో పూజలు నిర్వహించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం తొలిమెట్టు వద్ద ఈవో సుబ్బారావు హారతులివ్వగా మహిళలు పసుపు, కుంకుమలతో మెట్టు మెట్టుకు పూశారు. ముందు పల్లకీలో స్వామిఅమ్మవార్లను మేళతాలాలతో తీసుకెళ్లగా పల్లకీ వెంట మహిళలు హారతులు వెలిగించి పటికబెల్లం నివేదన చేసుకుంటూ ప్రధానాలయానికి చేరుకున్నారు. పీఆర్వో కొండలరావు, సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు పాల్గొన్నారు. అలాగే రత్నగిరిపై వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.

భక్తులతో కిక్కిరిసిన రత్నగిరి

సత్యదేవుడి సన్నిధి ఆదివారం పౌర్ణమి పర్వదినం కావడంతో భక్తులతో కిక్కిరిసింది. సెలవు, పౌర్ణమి పర్వదినం, శనివారం రాత్రి రత్నగిరిపై వివాహమాచరించుకున్న జంటలు, వివిధ ప్రాంతాల్లో పెళ్లైన నూతన జంటలతో రద్దీ ఏర్ప డింది. సుమారు 3వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.40 లక్షల ఆదాయం లభించింది.

ఆలయ సిబ్బందితో నూతన ఈవో సమీక్ష సమావేశం

అన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా శనివారం బాధ్యతలు స్వీకరించిన వీర్ల సుబ్బారావు ఆదివారం సాయంత్రం దేవస్థానం అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది పరిచయ కార్య క్రమం అనంతరం దేవస్థానంలో విభాగాల వారీగా రివ్యూ నిర్వహించారు. ఆలయాల అభివృద్ధికి భక్తులే మూలమని, భక్తులకు ఏవిధంగా మరింత మెరుగైన సేవలు అందించగలం, కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉదయమే 5గంటలకు ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. సన్నిధి బుకింగ్ కౌంటర్, కమాండ్ కంట్రోల్ రూంలను పరిశీలించారు. సెక్యూరిటీ వ్యవస్థపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

తండ్రిని చంపి... బంధువులకు చెప్పి!

పెంపుడు కొడుకు చేతిలో హత్యకు గురైన తండ్రి, ఆస్తి పంచాలని గొడవ


హత్యకు గురైన వీరవెంకటనరసింహారావు


హత్య చేసిన రాంబాబు

అంతర్వేది, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కొడుకు చేతిలో తండ్రి హత్యకు గురైన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. కొడుకు రాంబాబు చేతిలో తండ్రి రావి వీరవెంకటనరసింహారావు (75) హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో రాంబాబు అనే వ్యక్తి రోజూ ఆస్తి పంచాలని పెంపుడు తల్లిదండ్రులతో గొడవ పడుతూ ఉండేవాడు. అతడి మానసిక స్థితి కూడా సరిగా లేకపోవడంతో శనివారం రాత్రి జరిగిన గొడవలో ప్లాస్టిక్ కుర్చీతో తండ్రి వీరవెంకట నరసింహారావు తలపై కొట్టడంతో చెవి, ముక్కులో నుంచి రక్తం వచ్చింది పడిపోయాడు. అతడి భార్య ఈ గొడవ చూడలేక పక్కింటికి వెళ్లిపోవడంతో వీరవెంకటనరసింహారావును కాపాడేవారు లేకపోవడంతో మృతిచెందాడు. తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన రాంబాబు బంధువులను పిలిచి విషయం చెప్పడం కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. ఆదివారం ఉదయం పోలీసులు, క్లూస్ టీమ్ వచ్చి వీరవెంకటనరసింహారావు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం రాంబాబును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పిల్లలు లేకపోవడంతో వీరవెంకటనరసింహారావు రాంబాబును దత్తత తీసుకున్నాడు. సుమారు 40 ఏళ్లు పెంచి పోషించిన విశ్వాసం కూడా లేకుండా రాంబాబు తండ్రిని హత్య చేయడంతో బంధువులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో కొనసాగిన ఐటీ దాడులు

పెద్దాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఆదాయపన్ను శాఖ (ఇన్‌కంట్యాక్స్) అధికారుల దాడులు ఆదివారం కొనసాగాయి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ ఇళ్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి బంధువుల ఇళ్లలో మూడోరోజు ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇప్పటికే సంస్థకు సంబంధించిన పలు కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే ఐటీ దాడులు సమయంలో లక్షిత వ్యక్తులకు సన్నిహితులైన కొంతమంది అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఆదివారం వారిని సైతం ఐటీ అధికా రులు గుర్తించి మరింత సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. వాలుతిమ్మాపురం, వడ్లమూరు వెళ్లే రహదారిలో ఉన్న శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ పరిశ్రమల్లో పలు రికార్డులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పుష్కర కాలువలో మృతదేహం లభ్యం

గండేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి మృతదేహం పుష్కర కాలువలో లభ్యమైంది. కాకినాడ జిల్లా గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం... గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన లక్కాకుకల వెంకటేశ్వరరావు(59) ఈనెల 12న ఉదయం బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. అయితే ఆదివారం ఉదయం తాళ్లూరు గ్రామంలో పామాయిల్‌తోట పక్కన పుష్కర కాలువలో వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. కేసు నమోదు చేశారు.


వెంకటేశ్వరరావు మృతదేహం

పృచ్ఛకుల ప్రశ్నలు.. చమత్కారంగా సమాధానాలు..

పిఠాపురంలో భగవద్గీతపై అష్టావధానం


అష్టావధానంలో ప్రశ్నలకు సమాధానాలిస్తున్న అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పృచ్ఛకులు సంధించే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ, మధ్యలో అసందర్భ ప్రశ్నకలకు చిరునవ్వుతో చమత్కారంగా స్పందిస్తూ భగవద్గీతలోని అంశాలను వివరిస్తూ చేసిన అష్టావధానం ఆసక్తికరంగా సాగింది. కాకినాడ జిల్లా పిఠాపురం శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు నిర్వహించిన భగవద్గీత అష్టావధానం ఆకట్టుకుంది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అధ్యక్షతన జరిగిన ఈ అవధానానికి గురు సహస్రావధాని డాక్టర్ గరిమెళ్ల వరప్రసాద్ సంచాలకులుగా వ్యవహరించారు. పృచ్ఛకులు లింగాల యాజ్ఞవల్క్య శర్మ, జోశ్యుల కృష్ణబాబు, అష్టావధాని కాకరపర్తి దుర్గాప్రసాద్, మార్ని జానకిరామచౌదరి, దాయన సురేష్‌చంద్రజీ, శతావధాని పోచినపెద్ది సుబ్రహ్మణ్యం, డాక్టర్ వేదుల శ్రీరామశర్మ, సూరంపూడి వెంకటరమణలు వ్యవహరించారు. సుమారు 6గంటల పాటు అష్టావధానం సాగింది.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

అష్టావధానం జరిగిన వేదికపై పురాతన ఆగమశాస్త్ర పద్ధతుల్లో నిర్వహించిన ఆలయ దర్శనం నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ప్రముఖ నాట్యాచారుడు సప్పాదుర్గాప్రసాద్ మార్గదర్శకత్వంలో నటరాజ నృత్యనికేతన్ కళాకారుల ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. పలువురు కవులను, నృత్యప్రదర్శన ఇచ్చిన కళాకారులను డాక్టర్ ఉమర్‌ఆలీషా సత్కరించారు. కార్యక్రమంలో పీఠం ప్రతినిధులు ఆకుల రవితేజ, ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌టీవీ ప్రసాదవర్మ, పింగళి ఆనంద్ తదితరులున్నారు.

సచివాలయంలో మద్యం బాటిళ్లు

ఇద్దరు వీఆర్వోల నిర్వాకం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం బాటిళ్లు బ్యాగ్‌లో పెట్టుకుని సచివాలయానికి తీసుకెళ్లిన ఘటన సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ గ్రామసచివాలయంలో జరిగింది. ఇద్దరు వీఆర్వోలు వారి క్యాబిన్‌లో మద్యం బాటిళ్లు కలిగి ఉన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెళ్లి తనిఖీ చేయగా వాటిని రైతులు తెచ్చారని బుకాయించే ప్రయత్నం చేశారు. రైతులే మద్యం బాటిళ్లు తెచ్చి ఉంటే వారికి ఏ పని చేయడానికి వీఆర్వోలు మద్యం బాటిళ్లు లంచంగా తెప్పించుకున్నారో వారికే తెలియాలి. బాధ్యత గల వీఆర్వోలు మద్యం బాటిళ్లు కలిగి అది కూడా సచివాయలంలో ఉండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం తెలిసి తహశీల్దార్ వివరణ అడిగినట్టు తెలిసింది. వీఆర్వోలపై కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.


మద్యం బాటిళ్లతో ఉన్న బ్యాగ్‌ను లాగుతున్న సిబ్బంది

పాపికొండలకు 18 బోట్లలో పర్యాటకులు


పాపికొండలకు పర్యాటకులతో వెళ్తున్న బోట్లు

వీఆర్‌పురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) పాపికొండలు, పేరంటాలపల్లి విహారయాత్రకు పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు పేరంటాలపల్లి, పాపికొండల్లోని ప్రకృతి అందాలను తిలకించేందుకు 18 పర్యాటక బోట్లపై దాదాపుగా 1200 వందల మంది విహారయాత్రకు వెళ్లారు. గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రకృతి అందాలను, పాపికొండల అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. పేరంటాలపల్లిలోని మునిమఠం (శివాలయం) పర్యాటకులతో కళకళలాడింది. కొండరెడ గ్రా మంలో పండుగ వాతావరణం కనిపించింది. గోదావరి నదిలో 18బోట్లు ఒకేసారి విహారయాత్రకు వెళ్లడంతో పర్యాట కులు ఆనందంగా విహార యాత్ర సాగించి సాయంత్రానికి వెనుతిరి గారు.

విహారయాత్రకు బ్రేక్.. మళ్లీ అనుమతులు

రంపచోడవరం/దేవీపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటన జరగనుండడంతో పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లను ఆదివారం నిలిపివేశారు. కాగా, సోమవారం కూడా నిలుపుదల చేసినట్టు అధికారులు ముందు ప్రకటించారు. కానీ ఈనెల 16నుంచి పర్యాటక బోట్లకు పూర్తి అనుమతులు ఉన్నవారు యథావిధిగా నిర్వహించుకోవచ్చని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ఆమె మాట్లాడుతూ సీఎం పర్యటన పోలవరంలో ఉన్నందున అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైసెన్స్ (ముందు జాగ్రత్తచర్యగా) దేవీపట్నంలోని గోదావరి పర్యాటక బోట్లను నిలుపుదల చేశామన్నారు. ఈనెల 16 నుంచి పర్యాటక బోట్లకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు ఉన్నవారు యథావిధిగా నడపవచ్చని, పర్యాటక బోట్లకు పర్యాటకుల భద్రతకు లైఫ్ జాకెట్లు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. చూపిన ప్రతిభ ఆధారంగా ఏడుగురు క్రీడాకారులను రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. పిఠాపురంలో ఈనెల 19,20వ తేదిల్లో రాష్ట్రస్థాయి పురుషుల బాక్సింగ్ పోటీల్లో వారు కాకినాడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. 55కిలోల విభాగంలో జె.నందకిషోర్(తుని), 60కిలోల విభాగంలో ఆర్.దుర్గాఅప్పలరాజు(తుని), 65కిలోల్లో పి.ధనుష్(కాకినాడ), 70కిలోల్లో బి.చిన్ని(తుని), 75కిలోల విభాగంలో జి.శివప్రసాద్(మాధవపురం), 80 కిలోల్లో కె.కిషోర్(తొండంగి), 85కిలోల విభాగంలో పీడీఎస్ శివ(అన్నవరం) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీలను రగ్బీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కేతవరపు కృష్ణ, సోము గోవిందరాజులు ప్రారంభించారు.

అమ్మో పులి!

పులిని చూసి ఆస్పత్రిపాలైన వ్యక్తి

రాజవొమ్మంగి డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పులి సంచారం ఇక్కడి ప్రజలకు శాపంగా మారిందనే చెప్పాలి. ఈనెల 2న రాజవొమ్మంగి మండలంలో పులి సంచారంతో ప్రజలు భయపడిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం రాత్రి పులిని చూసి ఓ వ్యక్తి ఆస్పత్రి పాలయ్యాడు. అడ్డతీగల మండలం కినపర్తి గ్రామానికి చెందిన తొంట చిన్నబాబు శనివారం సాయంత్రం పొలానికి వెళ్తూ మార్గమధ్యలో పులిని చూసి బెంబేలెత్తిపోయాడు. భయంతో పొలానికి వెళ్లగా అతడి భార్య చిన్నబాబుకు సపర్యలు చేయగా తిరిగి ఇంటికి వస్తుండగా దూరంగా పెద్దగా శబ్దం రావడంతో స్పృహ కోల్పోయి అడ్డతీగల ప్రభుత్వాసుపత్రిలో చేరాడని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనపై అటవీశాఖ సిబ్బంది శనివారం, ఆదివారం వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారని, పులి పాదముద్రలు దొరకలేదు. కానీ మరో వ్యక్తి కూడా పులిని చూసినట్టు చెపుతున్నారని ఎఫ్ఎస్‌వో అర్జునుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కాకినాడ

'సముద్రంలో స్నానాలు చేయరాదు'

సర్పవరం జంక్షన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో కెరటాల ఉధృతి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సముద్రంలో ఎవరూ స్నానాలు చేయరాదని కాకినాడ మెరైన్ సీఐ రామ్మోన్‌రెడ్డి కోరారు. ఆదివారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో సాయంత్రం ఆనందంగా గడిపేందుకు విచ్చేసిన యువతీ, యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి వార్షిక ధనుర్మాస మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు జనవరి 14వ తేది వరకూ జరగనున్నాయి. వైఖానసాగమోక్త ప్రకారం స్వామి, గోదాఅమ్మవారికి, ఆళ్వార్లకు సేవలు, విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు ఈ నెల 16వ తేది ఉదయం 5.30గంటలకు అభిషేకం, ధనుర్మాసం ప్రారంభం, స్వామి, గోదాఅమ్మవార్లకు పంచామృతాభిషేకం, శ్రీచూర్ణం అర్చనలు, ద్రవిడ ప్రబంధ పారాయణ నివేదనలు, రాత్రి గోదాఅమ్మవారి మాడవీధిసేవ జరుగుతుంది. 16 నుంచి జనవరి 14వ తేది వరకూ ప్రతి రోజూ తెల్లవారుజామున 4గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చనలు, గోదా అమ్మవారికి చూర్ణం అర్చనలు, రాత్రి ద్రవిడ ప్రబంధ పారాయణ, పాశుర విన్నపం నిర్వహిస్తారు. అలాగే పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకూ ధనుర్మాస ఉత్స వాలు జరగనున్నాయి. నెలరోజుల పాటు భ క్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించనున్నారు. రోజూ స్వామి,అమ్మవార్లకు పంచామృతాభిషేకం, విశేషపూజలు జరుగుతాయి. ఉత్సవాలు అనంతరం 15వ తేదీ కనుమ రోజున స్వామి,అమ్మవార్ల గ్రామోత్సవం జరుగుతుంది. ధనుర్మాస వేడుకల్లో పాల్గొనే భక్తులు ఆలయ అర్చకులు పి.విజయజనార్ధనాచార్యులను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

సామర్లకోట: ధనుర్మాస మహా పర్వదినం పురస్కరించుకుని సామర్లకోట మండలం, పట్టణంలలో అన్ని వైష్ణవ ఆలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. సామర్లకోట గోదావరి ఒడ్డున పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్య నారాయణ స్వామి ఆలయంలో పండితులు విశేష పూజలు నిర్వహించనున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కోలో ప్రధానమైన పెద్దాపురం-పాయకరావుపేట మధ్య గల 132కేవీ విద్యుత్‌లైన్ మార్పు చేస్తున్న నేపథ్యంలో ఈనెల 17న పిఠాపురం, సామర్లకోట పరిసర ప్రాంతాలు, రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు రైస్‌మిల్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఖాజా రహంతుల్లా, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని వారు కోరారు.

ప్రజల కంటికి నిద్ర కరువు!

● సామర్లకోటలో దోమల బెడద ● అసంపూర్తిగా పూడిక తీత పనులు



సామర్లకోటలో ఓ వార్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

సామర్లకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీలో అధికారుల తీరు మారదు, పారిశుధ్య సిబ్బంది విధులపై అజమాయిషీ చేసేవారు ఉండరు. దీంతో దాదాపు 31 వార్డుల్లోనూ చెత్త,చెదారాలు పూర్తిస్థాయిలో తొలగించేది లేదు. కనీసం చిన్న చిన్న మురుగుకాల్వలలో పూడిక తీయరు. ఈ కారణంగా దోమలు పెరిగి ప్రజలకు కంటికి నిద్ర కరువైంది. ఇదే విషయమై ఇటీవల కౌన్సిల్ సమావేశంలో దోమల నిర్మూలన



కాలువలో తొలగించని ప్లాస్టిక్ వ్యర్థాలు

చేపట్టాలని కోరినా ఏ ఫలితం లేకపోయింది. ఇటీవల పట్టణం అంతటా ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తొలగించే పనుల కోసం రూ. 36 లక్షల వరకూ ప్రభుత్వ నిధులు వ్యయం చేసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు తిరిగి ముంపు బెడద వచ్చింది. నెంబరు-2 మార్కెట్ నుంచి కొత్తూరు ప్రెసిడెంట్ గారి వీధి వరకూ గల ప్రధాన మురుగు కాలువలో పూడిక తీత పనులు ఎక్కడి చందాన అక్కడే ఉండడంతో ముంపు బెడద మామూలైంది. డ్రైన్లపై ఆక్రమణలను తొలగించకుండా పైపై పనులు మాత్రమే తూతూమంత్రంగా చేపట్టారన్న ఆరోపణలు అటు కౌన్సిలర్ల నుంచి, ఇటు ప్రజానీకం నుంచి వెల్లువెత్తుతున్నాయి. పొట్టి శ్రీరాములు పార్కు ఎదురుగా ప్రధాన డ్రైన్‌పై ఉన్న శ్లాబ్ రాయిని తొలగించి సుమారు నెలరోజులు కావస్తున్నప్పటికీ అక్కడ పూడిక తొలగించకపోగా తొలగించిన శ్లాబ్ రాయిమీదుగా వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న కాలువలో పూడిక తొలగించకపోవడం వల్ల నెంబరు-2 మార్కెట్ ఏ కొద్దిపాటి వర్షం కురిసినా ముంపు బెడద తప్పడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఇక తరచూ ఆర్టీసీ కాంప్లెక్స్ ముంపు బెడదకు కారణమైన ఓవర్‌బ్రిడ్జి దిగువ నుంచి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుకగల ప్రధాన డ్రైన్‌లో పూడిక తీత పనులు ఎక్కడి పనులు అక్కడ చందాన మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాలువలో తొలగించిన పూడికను పూర్తిస్థాయిలో తరలించకపోవడంతో ఇటీవల వర్షాలకు తిరిగి గట్టున ఉన్న పూడిక తిరిగి కాలువలో చేరి యథాతదంగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. నెంబరు-2 మార్కెట్ వద్ద ప్రధాన డ్రైన్‌లో పూడిక తొలగిస్తామని చిరువ్యాపారులను ఖాళీ చేయించి సుమారు 25రోజులు అవుతున్నప్పటికీ పూడిక తీత పనులు చేపట్టడం మున్సిపల్ అధికారులు విస్మరించారని చిరువ్యాపారులు వాపోతున్నారు. గత రెండేళ్లుగా పట్టణంలో దోమల పెరుగుదలను నిరోధించేందుకు ఫాగింగ్ యంత్రాలను ఏమాత్రం వినియోగించకపోవడం వల్ల మూలకు చేరాయని పలువురు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సత్వరం స్పందించి పట్టణంలో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

పాదగయలో వైభవంగా దత్తాత్రేయ జయంతి

ముగిసిన సప్తాహ మహోత్సవాలు



ప్రత్యేక అలంకారంలో దత్తాత్రేయస్వామి

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి జయంతి సప్తాహ మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. సప్తాహ మహోత్సవాల చివరి రోజున దత్తాత్రేయునికి మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో సర్వపుష్పార్చన, దత్తమాల మంత్రములతో హోమం, పూర్ణాహుతి, అవబృథం జరిగాయి. సాయంత్రం స్వామికి ప్రత్యేక ఊయలసేవ జరిగింది. భక్తులు స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఔదంబర వృక్షం వద్ద, శ్రీపాదశ్రీవల్లభునికి పూజలు జరిపారు. గురుచరిత్ర పారాయణ, పూలంగి సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో దత్త గురువు వాడ్రేవు శ్రీనివాసరావు, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

వన్నెపూడిలో...

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వన్నెపూడిలో దత్తాత్రేయస్వామి జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దత్త జయంతి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలుజరిగాయి. వైఖానస ఆగమం ప్రకారం దత్తస్వాములతో విష్వక్సేన పూజలు, ఆరాధన అభిషేకాలు, లక్ష తులసి పూజ నిర్వహించారు. భారీ అన్నసమారాధన జరిగింది. చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. సాయంత్రం దత్తహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు కిలోమీటరు పొడవునా బారులు తీరారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.

మద్యానికి దూరంగా ఉండాలి

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని మద్యంతో జరుపుకోవద్దని, దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార సమితి ప్రతినిధులు సూచించారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

సామర్లకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును కోరుతూ ఆమరణ దీక్షలు చేపట్టి చివరకు తన ప్రాణాన్నే త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం పురస్కరించుకుని ఆదివారం సామర్లకోట ఎన్టీఆర్ పార్కులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాజప్ప పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

పిఠాపురం: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద శ్రీరాములు విగ్రహానికి, చిత్రపటానికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆత్మార్పణ దినోత్సవంగా గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు కనకారావు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు ఉన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లబాయ్‌పటేల్ చిత్రపటాలకు మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, వైసీపీ నేతలు నివాళులర్పించారు.



సామర్లకోటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించి నమస్కరిస్తున్న చినరాజప్ప

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతీరాణీ, సిబ్బంది, కౌన్సిలర్లు ఉన్నారు.

కాకినాడ రూరల్: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం, కళాశాల ఆంగ్ల, తెలుగు విభాగాధిపతి డాక్టర్ పి.హరిరామ్‌ప్రసాద్, సమైక్య భారతి జిల్లా అధ్యక్షులు గౌరీనాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించు కుని సోమవారం కళాశాలలో జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు గౌరీనాయుడు తెలిపారు. పశ్చిమ బెంగాల్, చత్తీష్‌ఘర్, తెలంగాణ, ఏపీ నుంచి పలు విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సందీప్‌కుమార్, జేకేసీ సమన్వయకర్త సత్యనారాయణ, పీడీ వర్మ, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, బుజ్జి, ఆశీర్వాదం పాల్గొన్నారు.

వన్నెపూడిలో ప్రముఖుల పూజలు



దత్తాత్రేయస్వామిని దర్శించుకుంటున్న వేములపాటి అజయకుమార్, మర్రెడ్డి

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వన్నెపూడిలోని దత్తాత్రేయస్వామిని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుల దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు.

వాసవిక్లబ్ వైస్‌చైర్మన్‌గా నగేష్

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్‌చైర్మన్‌గా పిఠాపురరం పట్టణానికి చెందిన వెలగా వెంకట నగేష్ ఎన్నికయ్యారు. తమిళనాడులోని మధురైలో ఆదివారం జరిగిన క్లబ్ అంతర్జాతీయ సదస్సులో నగేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో క్లబ్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ ప్రమాణస్వీకారంచేయించారు.



పూజలు చేస్తున్న సినీనటుడు పృథ్వీరాజ్

పాదగయలో సినీనటుల పూజలు

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పుర్హుతికాఅమ్మవార్లను ఆదివారం సినీనటుడు రాజేంద్రప్రసాద్, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఫేమ్ పృథ్వీరాజ్, పిఠాపురంలో అలా మొదలయింది సినిమాలో నటీనటులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. సినీనటులకు ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

శివార్లలో ఎండిన దాళ్వా నారుమడి

కొత్తపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాగునీరందక కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో దాళ్వా నారుమళ్లు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సంభవించిన వరుస తుపాన్లతో సార్వా పంటను ఒబ్బిడి చేసుకోవడంలో రైతులు తలమునకలై ఉన్నారు. ఒక పక్క సార్వా పంటను కోత కోస్తూ మరో పక్క నారుమళ్లను తయారు చేసుకున్నారు. తీరా నారుమళ్లు వేసుకునే పరిస్థితికి వచ్చే సరికి కాలువల ద్వారా వచ్చే నీటితో మొగలో చేలల్లో ఆకుమడులకు నీరు సరఫరా జరగడంతో అయా ప్రాంతాల్లో నారుమళ్లు వేసుకున్నారు. కాలువ చివర భూములకు, శివారు గ్రామాల్లో ఉన్న భూముల్లో నారుమళ్లకు సక్రమంగా నీరందక ఎండిపోతున్నాయి. దీంతో కాలువలోని నీటిని మోటార్లతో తోడుకుంటూ నారుమళ్లకు నీరు అం దిస్తున్నారు. డిసెంబరు నెలాఖరునాటికి దాళ్వా వరినాట్లు పూర్తిచేయాలని అధికారుల ప్రకటనలు చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. కొత్తపల్లి మండలంలో పలు గ్రామా ల్లో దాళ్వా నారుమళ్లకు నీరందక పోవడంతో ఆకుమ డులు ఎండిపోవడంతో ఏమిచేయాలో తెలియని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను రైతులు కోరుతున్నారు.



కాశివారిపాకల శివార్లలో వాడిన దాళ్వా నారుమడి

లేజర్ వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి

కాకినాడ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో సురక్షితమైన లేజర్ వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ త్రిమూర్తులు రాయుడు పేర్కొన్నారు. లేజర్ చికిత్స విధానం-వాటి ఉపయోగాలు అనే అంశంపై ఆదివారం స్థానిక గాంధీనగర్ శ్రీ లాస్య హాస్పటల్ ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రాయుడు మాట్లాడుతూ లేజర్ వైద్య రంగంలో అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈలేజర్ చికిత్స విధానం ద్వారా టాటూస్ తొలగించవచ్చని, బొల్లి మచ్చల సమస్యను పరిష్కరించవచ్చన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా లేజర్ చికిత్స విధానాన్ని వివరించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.రాధిక, వివిధవిద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించేందుకు కృషి

కాకినాడ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు 'మేవా' కృషి చేస్తోందని ముస్లిం ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ జవహర్ ఆలీ పేర్కొన్నారు. స్థానిక మేవా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిరుద్యోగ యువతకు మేవా యూత్ ఆధ్వర్యంలో ఎంపవర్మెంట్ వర్క్‌షాప్ నిర్వహిచారు. ఈకార్యక్రమానికి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎండీ అబ్దుల్ అజీజ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మేవా అధ్యక్షుడు జవహర్ ఆలీ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలను అందించే దిశగా చర్యలు చేపట్టామని, అందులో భాగంగా నైపుణ్యం పెంచే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. మేవా ఉపాధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్, కార్యదర్శి సయ్యద్ సలార్, కోశాధికారి చిష్తి, సంయుక్త కార్యదర్శి అజహర్, రిసోర్స్ పర్సన్ నజీర్ అహ్మద్, ప్రొఫెసర్ నదీమ్, అన్సర్ ఆలీ, ఆదిత్య ఐటిఐ ఫౌండేషన్ స్కూల్ ప్రిన్సిపాల్ మెయినా, నారాయణ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ షర్మిల, టీఎంసీ సభ్యుడు జాకీర్ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం తర్వాత 10గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

హక్కుల సాధనకు ఐక్యతతో ముందుకు సాగాలి



ఐక్యత చాటుతున్న పద్మశాలి సంఘాల నేతలు

కాకినాడ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సామాజిక వర్గమంతా హక్కుల సాధనకు ఐక్యతగా ముందుకు సాగాలని పద్మశాలి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆమంచి అంజనేయ గురుస్వామి, జిల్లా అధ్యక్షుడు పంపన రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రామారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షత వహిచంగా, ముఖ్యఅతిథిగా గౌరవ అధ్యక్షుడు గురుస్వామి విచ్చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక పద్మశాలి సంఘాలు ఉన్నాయని, వాటన్నింటిని ఐక్యపరచి త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. జేఏసీ ద్వారా పద్మశాలి సామాజిక వర్గీయులకు రాజకీయంగా, సామాజికంగా రావాల్సిన హక్కుల సాధనకు పోరాడతామన్నారు. సంఘ నాయకులు పసగడుగుల సత్యనారాయణ, కొండేటి వీరవెంకటసత్యనారాయణ, కొప్పుల శ్రీనివాస్, బొజ్జ శ్రీశైలం, పంపన సూర్యచంద్రరావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్ర రాష్ట్రం

● ఎమ్మెల్యే వనమాడి కొండబాబు
● పొట్టి శ్రీరాములు వర్ధంతి

కాకినాడ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం అవతరించిదని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆర్య వైశ్య సంఘాలు ఆధ్వర్యంలో ఆదివారం స్థానికసీబీఎం స్కూల్ రోడ్డు ఫెలోషిప్ చర్చి సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో పొట్టి శ్రీరాములు అజరామరంగా నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఆర్యవైశ్య మహాసభ కాకినాడ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పులవర్తి కుమార్, ది యంగ్‌మెన్స్ వైశ్య అసోసియేషన్ అధ్యక్షుడు చక్కా ప్రకాష్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు అద్దేపల్లి గంగరాజు, వైశ్య లేడీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు గుల్లపూడి ప్రియాంక, ఆర్య వైశ్య సంఘాల నాయకులు బచ్చు శేఖర్, అద్దేపల్లి లక్ష్మణ్, యక్కల ప్రసాద్, వెత్సా మురళి, డీవీఆర్ స్వామి, బచ్చు ప్రభు, పాలెపు రామకృష్ణ, గ్రంధి నీల్, దంగేటి సతీష్, చక్కా సత్యనారాయణ, నెరెళ్ల మురళి, బచ్చు హారిక తదితరులు పాల్గొన్నారు.



కాకినాడసిటీ: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, ఆర్య వైశ్య సంఘాల నాయకులు

పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడు

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ మూల పురుషుడు పొట్టి శ్రీరాములు తెలుగు వారందరికీ చిరస్మరణీయుడు నగరపాలక సంస్థ కమిషనర్ భావన కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీబీఎం స్కూల్ రోడ్డు, ఫెలోషిప్ చర్చి సెంటర్‌లో ఆయన విగ్రహానికి కమిషనర్ భావన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రీడాప్రాధికార సంస్థ నివాళి

కాకినాడఅర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి); పొట్టి శ్రీరాముల 72వ వర్ధంతి సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. గొడారిగుంట మూడుగుళ్లసెంటర్లో ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో వై.గోవిందరావు, పీటీ దొర, జిమ్నాస్టిక్స్ శిక్షకుడు సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

సామర్లకోట, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): దత్త జయంతి మహాపర్వదినాన్ని పురస్కరించు కుని ఆదివారం సామర్లకోట కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం చెంతన వేంచేసియున్న దత్తాత్రేయుడికి ఏకాదశ రుద్రాభిషేక పూజలు, హోమపూజలు నిర్వహించారు. కంచి మహాసంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి ఆధ్వ ర్యంలో వేద పండితులు మహంకాళి వెంకటరా మమూర్తి, ఇంద్రగంటి సోమయాజులు తదితర చక్రవర్తుల కుటుంబీకులు శాస్త్రోక్తంగా పూజలు, విశేష అభిషేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సామరకోట పరిసర ప్రాంతాలకు చెంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం నిర్వహించిన లక్ష పత్రి పూజల్లో కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. కంచి మహాసంస్థానంలో హనుమద్‌వ్రత పూజలు ముగింపులో భాగంగా ఆంజనేయస్వామికి, గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు.

మహాగర్జనకు బస్సుల్లో తరలిన మాలలు



తాళ్లరేవు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహాగర్జన కార్యక్రమానికి తాళ్లరేవు మండలం నుంచి ఆదివారం వందలాది మంది తరలివెళ్లారు. మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతారామపురం, జెల్లావారిపేట, జైభీమ్‌పేట, సుంకటరేవు, జార్జీపేట, సుంకరపాలెం, చొల్లంగి, పి.మల్లవరం తదితర గ్రామాల నుంచి మాలలు బస్సుల్లో తరలివెళ్లారు. మాలనేతలు జక్కుల ప్రసాద్, కాశి లక్ష్మణస్వామి, దున్నా మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం, దడాల బుజ్జిబాబు, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎలిపే నాగేశ్వరరావు, దడాల జగదీశ్వరరావు, మేడపాటి దేవానందం తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కంపెనీల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎల్పీజీ గ్యాస్ కంపెనీల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల ఇఫ్టు జిల్లా కార్యాలయలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎస్.రాజేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాకినాడ శ్రీఏజెన్సీ యాజమాన్యం తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును తక్షణం అమలు చేయాలన్నారు. అన్ని గ్యాస్ కంపెనీలీట్ల కార్మికులకు అపాయింట్ ఆర్డర్లు, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు బాబి, వీరబాబు, లోవరాజు, బి.కృష్ణ, రాంబాబు, కె.సత్యనారాయణ, చిన్న పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలకు సాత్విక్ ఎంపిక

కాకినాడ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల25న జరగనున్న రాష్ట్రస్థాయి భగవద్గీత ప్రవచనాల పోటీలకు కాకినాడ అక్షర స్కూల్ 4వ తరగతి విద్యార్థి కుడిపూడి శేష సాత్విక్ ఎంపికయ్యాడు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యార్థులకు భగవద్గీత ప్రవచనాల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో మొదటి ర్యాంక్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సాత్విక్‌కు మెమెంటో, సర్టిఫికెట్ అందజేశారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నాగబాబు

కాకినాడ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ వైద్య ఆరోగ్యశాఖలో మలేరియా విభాగ సబ్‌యూనిట్ అధికారిగా పనిచేస్తున్న యాతం నాగబాబు మాస్టర్ అథ్లెటిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విజయవాడలో ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల14,15 తేదీల్లో 44వ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పరుగు పందెం విభాగంలో 200,400,800 మీటర్ల విభాగాల్లో నాగబాబు పాల్గొని మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఫిబ్రవరి 2నుంచి 8వరకు రాజస్థాన్‌లో జరిగే మాస్టర్ అథ్లెటిక్స్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

జూడో పోటీలకు జగ్గంపేట విద్యార్థుల ఎంపిక

జగ్గంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గవర్నమెంట్ హైస్కూల్‌లో ఆదివారం సీనియర్ జిల్లా స్థాయి జూడో పోటీలకు 19మంది విద్యార్థులు, 8 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు జిల్లా జూడో అసోసియేషన్ సెక్రటరీ తాండ్రోతు వీరవెంకటరమణ తెలిపారు. రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులను జగ్గంపేట గవర్నమెంట్ హైస్కూల్ హెచ్ఎం రంగారావు, రాజకీయ నాయకులు అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

● అధికారులకు కలెక్టర్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయం నుంచి చింతూరు, రంపచోడవరం డివిజన్‌ల పరిధిలోని అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పోలవరం నిర్వాసితుల సమస్యలు, సదుపాయాలపై అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోయిన వారి వివరాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సమగ్రమైన సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు, వాటిపై వచ్చిన ఫిర్యాదులు, ఆర్‌ఆర్ కాలనీలలో సదుపాయాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టుపై ప్రతీవారం సమీక్షిస్తామన్నారు. బాధితుల వివరాలు, సమస్యలు సేకరించించి సమగ్రమైన నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహాచలం, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలను గుర్తించాలి

● ఐటీడీఏలో పొట్టి శ్రీరాములు వర్ధంతి

రంపచోడవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆ మరణ నిరాహారదీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించారని ఆయన సేవలను ప్రతి ఆంధ్రుడు గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, డీఈలు చైతన్య, నాగరాజు, సీనియర్ అసిస్టెంట్లు బి.రాజు, శ్రీకాంత్, పి.భీమిరెడ్డి, దయానంద్, విల్సన్, గ్యాస్ మేనేజర్ చిన్నబ్బాయి పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

మధుచందనకు జాతీయ స్థాయిలో రజతం



వెయిట్ లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించిన గుత్తుల మధుచందన

చింతూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరుకు చెందిన గుత్తుల మధుచందన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రజత పతకం సాధించింది. ఈనెల 9 నుంచి 15 వరకు ఢిల్లీలో 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చింతూరు కస్తూర్బా కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతున్న గుత్తుల మధు చందన+87 కేటగిరి పోటీలలో పాల్గొంటారు. మధు చందన రజత పతకం సొంతం చేసుకుంది. తాజా పోటీలలో అల్లూరిజిల్లా మొత్తంలో మధు చందన జాతీయస్థాయిలో పతకం సాధించడంతో పలువురు అభినందించారు. మధు చందన వరుస విజయాలకు తోడ్పాటు, శిక్షణ ఇస్తున్న కోచ్ గంగాధర్‌ని పలువురు అభినందించారు.

గుర్తేడు రోడ్డు సమస్యపై నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

ఆదివాసీ సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి

వై.రామవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వై.రామవరం నుంచి గోకవరం మీదుగా గుర్తేడు తారురోడ్డు నిర్మాణంపై నేటి నుంచి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆదివాసీ చైతన్యవేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుర్ల లచ్చిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నోఏళ్లుగా రోడ్డు నిర్మాణం ఫారెస్టు అభ్యంతరాలతో నిలిచిపోయిందని ఈ రోడ్డు పూర్తయితే సుమారు 60 గ్రామాల గిరిజనులకు సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. అదేవిధంగా రంపచోడవరం డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో అడ్డతీగల, రాజవొమ్మంగి, మారేడుమిల్లి గ్రామాల్లో కూడా నిలిచిపోయిన రోడ్లపై ఆదివాసీ సంఘం నిరసనలు తెలియజేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు తమ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని లచ్చిరెడ్డి కోరారు.

కూనవరం దుర్గాదేవి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కూనవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూనవరంలోని కనకదుర్గాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మందిగా భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో మూడు రోజుల పాటు హోమాలు నిర్వహించారు. అనంతరం ఆదివారం ఉదయం 8గంటల 5 నిమిషాలకు ఆలయం ముందు వేదపండితుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. అనంతరం మహాన్నదానం నిర్వహించారు. ఈ ధ్వజస్తంభ ప్రతిష్ఠకు టేకులబోరుకు చెందిన యాలం రామకృష్ణ, మైనేని శ్రీను, జంపన్న, జుత్తుక సూర్యచంద్రరావు, భారత్ హోటల్ నాగేశ్వరరావు, బంగారపుకొట్టు రమణ సహకారంతో పాటు భక్తులు విరాళాలతో ఈకార్యక్రమం నిర్వహించారు.

తెల్లరాయి తవ్వకాలను నిలిపివేసిన తహసీల్దార్

చింతూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం, సింగన్నగూడెం పరిసర ప్రాంతంలో జరుగు తున్న తెల్లరాయి తవ్వకాలను తహసీల్దార్ చిరంజీవి నిలిపివేశారు. అనుమతులు లేని తవ్వకాలను ఉపేక్షిం చేది లేదన్నారు. అక్రమ తవ్వకాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సింగన్న గూడెం పరిసర ప్రాంతంలో తెల్లరాయి తవ్వకాలను నిలిపివేయడంతో పాటు, మైనింగ్ శాఖకు నివేదిక పంపించామన్నారు.

సిరిగిందలపాడులో వైద్యశిబిరం

రంపచోడవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 400 మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలిపారు. వైద్య శిబిర సేవలను రామకృష్ణమిషన్ మేనేజన్ స్వామి రాఘువీరనంద మహరాజ్ పర్యవేక్షించారు. వైద్యశిబిరంలో 81 మందికి రక్త పరీక్షలు, 10 మందికి థైరాయిడ్ పరీక్షలు, ఆరుగురికి ఈసీజీలు, 20 మందిక ఎక్స్‌రేలు, ఐదుగురికి ఫిజియోథెరపీ సేవలు అందించారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 18 కళ్లజోళ్లు అందజేశారు. నలుగురికి కంటి ఆపరేషన్ల నిమిత్తం వేమగిరి తరలించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు జీవీ రామారావు, కస్తూరి సుబ్రమణ్యం, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్‌కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్, వాలంటీర్లు ఎల్‌జీబీ భగీరధరాజు, చంద్రశేఖర్, మంగిరెడ్డి, రామకృష్ణ సంజీవ్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వెదురునగరంలో కార్తవీర్యార్జున హోమం

అడ్డతీగల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురునగరం భువనేశ్వరి ఆశ్రమంలో మార్గశిర పౌర్ణమి దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని లోకకల్యాణార్థం కార్త వీర్యార్జున హోమం, శ్రీచెంచులక్ష్మీ ఉగ్రనరసింహ స్వామివారి దివ్య కల్యాణోత్సం ఘనంగా నిర్వహించామని భువనేశ్వరి ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిరామ్ గురూజీ తెలిపారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ ఏజెన్సీ ప్రజల ఆర్థిక,ఆరోగ్య, సిరిసంపదల, వ్యాపార, వ్యవసాయ అభివృద్ధిని మరింత పెంపొందించేందుకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహద పడతాయని సాయిరామ్ గురూజీ భక్తులకు వివరించారు. కళ్యాణం అనంతరం అడ్డతీగలకు చెందిన కాళ్ల లక్ష్మణ్, జ్యోతి దంపతులు సామూహిక అన్నసమారాదన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తిలకించడానికి ఏజెన్సీ, మైదాన ప్రాంతాల నుంచి సుమారు 12వందల మంది భక్తులు విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

● పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప


జర్నలిస్టుల క్రీడా పోటీల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప, కలెక్టర్ షాన్‌మోహన్, తదితరులు

గండేపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరిక, మానసిక ఆరోగ్యం లభిస్తోందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ గ్రౌండ్స్‌లో జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉంటూ ఒత్తిడితో జీవించే జర్నలిస్టులకు ఇలా క్రీడాపోటీలు ఒక ఉత్తేజమని చెప్పారు. జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని ఆయన కోరారు. కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్ మాట్లాడుతూ గెలుపు, ఓటములు కొలబద్ధంగా కాకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఈ పోటీలు జరగాలని ఆకాంక్షించారు. కాకినాడజిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పుడూ డ్యూటీలో బిజీగా ఉంటారని ఇలా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఒకే వేదికగా కలిసి క్రికెట్ ఆడటం ఆనందంగా అనిపిస్తుందన్నారు. ఆదిత్య యూనివర్శిటీ చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జర్నలిస్ట్స్ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్టేట్ ఏ, ఈస్ట్ గోదావరి బి, స్టేట్ బి, ఈస్ట్ ఏ జట్ల మధ్య పోటీలు ఆసక్తికరంగా జరగ్గా విన్నర్స్‌గా రాయలసీమ స్టేట్‌బి, రన్నర్స్ ఉభయగోదావరి జట్లు నిలిచాయి. కార్యక్రమంలో ఆదిత్య డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులం ప్రసాద్, గౌరవాధ్యక్షుడు బొళ్ళ సతీష్‌బాబు, ప్రచార కార్యదర్శి తలారి నాగలింగస్వామి, గౌరవ సలహాదారు అజయ్ ఇండియన్, అసోసియేషన్ నాయకులు తలారి రెడ్డప్ప, డీహెచ్‌వీ సాంబశివరావు, సిద్ధు, లోవరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్ర సాధకుడు పొట్టి శ్రీరాములు

ఘనంగా అమరజీవి వర్ధంతి


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాడిన మొట్టమొదటి వ్యక్తి పొట్టి శ్రీరాములు అని తెలుగు వారిని గుర్తించి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుచేయాలని 58 రోజులు ఆమరణ దీక్ష చేసిప్రాణాలు అర్పించిన చిరస్మరణీయులన్నారు. ఎస్‌వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జేవీఆర్ గ్రూప్స్ అధినేత జీను మణిబాబు, బొండా వీరసత్య, వెంట్రాప్రగడ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాముల వర్ధంతిని నిర్వహించారు. పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను కాంగ్రెస్ పార్టీ కార్యాకర్తలు పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు శ్రీను పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు నేతి వెంకటేశ్వరరావు, కాదా మురళీకృష్ణ, కందిమళ్ళ శామ్యూల్ పాల్గొన్నారు.

అమరజీవి జీవితం అందరికీ ఆదర్శం

ఏలేశ్వరం: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ప్రతీఒక్కరికీ ఆదర్శమని కౌన్సిలర్ అలమండ చలమయ్య కొనియాడారు. శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం నగర పంచాయతీ కార్యాలయంవద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెల్లాని శ్రీను, బూర్లు సత్తిబాబు, గెద్ద అప్పన్న, వీర్రాఘవస్వామి, గణేష్ ఉన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

తొండంగి: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండ ల రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ రాజారావు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన చేసిన త్యాగాలను స్మరించారు. బెండపూడిలో జరిగిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఏవీ నగరంలో టీడీపీ బీసీ సంఘ మండలాధ్యక్షుడు కొయ్యా రామకేశవ నివాళి అర్పించారు.


ఏలేశ్వరంలో శ్రీరాములు విగ్రహానికి నివాలులర్పిస్తున్న టీడీపీ నాయకులు


తొండంగి : పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం


ప్రత్తిపాడులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

హైందవ శంఖారావం కరపత్రాలు ఆవిష్కరణ

ఏలేశ్వరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):జనవరి 5న విజయవాడలో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని వీహెచ్‌పీ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఆదివా రం సిరిపురం శ్రీచిద్గగనానంద గీతాశ్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం, హైందవ దేవాలయాల స్వయం ప్రతిపత్తిని కల్పించాలని కోరుతూ విజయవాడ వేదికగా జనవరి 5న జరిగే సభకు హిందూ బంధువులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోమాతను జాతీయప్రాణిగా గుర్తించాలన్నారు. దేవాలయాలను ప్రభుత్వం ఆధీనం నుంచి హిం దూ ధార్మిక సంస్థలకు అప్పగించాలన్నారు. కరపత్రాలు ఆవిష్కరించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు కొల్లా శ్రీనివాస్, ఆకుల నూకాపతిరావు, ఉంగరాల బూరయ్య, మజ్జూరి వెంకటలక్ష్మీ, సోము సూర్యావతి, కొత్త రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడులో దేవర్ష్ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి ప్రారంభం

● పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీ


దేవర్ష్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ

ప్రత్తిపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోనూతనంగా ఏర్పాటుచేసిన దేవర్ష్ సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి గ్రామీణ ప్రాంతవాసులకు అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్‌లు అన్నారు. ప్రత్తిపాడులో ఫైర్‌స్టేషన్‌సమీపంలో డాక్టర్ విద్య ఆధ్వర్యంలో నిర్మించిన దేవర్ష్ ఆసుపత్రిని ఆదివారం ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఎమర్జెన్సీ విభాగాన్ని ఎంపీ ఉదయ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధునిక వైద్యం కోసం రాజమండ్రి, కాకినాడ వంటి నగరాలకు తరలిపోకుండా దేవర్ష్ ఆసుపత్రి వారికి అందుబాటులో ఉంటుందన్నారు. ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రిని నిర్మించిన డాక్టర్ విద్యను ఎమ్మెల్యేలు, ఎంపీ అభినందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అధినేతలు డాక్టర్ దివ్య, డాక్టర్ అంజినాయక్‌లు మాట్లాడుతూ అన్ని విభాగాల్లో వైద్య నిపుణులు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. పేదలకు గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వల్ప ఫీజులతో ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ ఆసుపత్రిని నెలకొల్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయ కులు వరుపుల తమ్మయ్యబాబు, కొమ్ముల కన్నబాబు, గోకాడ రాంబాబు, పర్వత సురేష్, అలమండ చలమయ్య, మూది నారాయణ స్వామి, పెంటకోట మోహన్, అమరాది వెంకట్రావు, సూది బూరయ్యలతోపాటు జిల్లా వ్యాప్తంగా వైద్యు లు, వైద్యాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కూచిపూడి కళాకారిణి లావణ్య ప్రదర్శించిన కూచిపూడి నృత్య కళాప్రదర్శన ఆకట్టుకుంది.

నీటి సంఘం అధ్యక్షులకు ఎమ్మెల్యే అభినందన

జగ్గంపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో యల్లమిల్లి, మల్లేపల్లి, బొర్రంపాలెం గ్రామాలకు చెందిన పుష్కర ఎత్తిపోతల పథకం బొర్రంపాలెం పంప్‌హౌస్ వన్ నీటి సంఘం అధ్యక్షుడు పెనుమర్తి అర్జునరావు, ఉపాధ్యక్షుడిగా బొట్ల బురయ్య, సభ్యులుగా తలారి శివ, కలిమి చిన్ని నాగేశ్వరరావు, బొడ్డుమురళి, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. విజయం సాధించిన వారందరినీ ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. యల్లమిల్లి, మల్లేపల్లి, బొర్రంపాలెం, గ్రామకూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన పుష్కర కాలువ నీటి సంఘం అధ్యక్షులు, సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన నీటి సంఘం అధ్యక్షులు

గండేపల్లి: మండలంలోని పుష్కరకాలువ నీటి సంఘం అధ్యక్షులు ఉప్పలపాడు అడబాల భాస్కరరావు, గండేపల్లి మాసిన సతీష్, యల్లమిల్లి పెనుమర్తి అర్జునరావు, మురారి నిమ్మలపూడి గోవిందరాజు, రాగంపేట కురుకూరి సత్యనారాయణ, సూరంపాలెం అన్నాబత్తుల అంజిబాబు, పి.నాయకంపల్లి పాలకుర్తి లక్ష్మీపతిరావు, రావిపాటి పద్మరాజు, ముండ్రు శ్రీనివాస్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. ఎమ్మెల్యే వీరికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, ఆదినారాయణ, పి.వెంకటేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.


నీటి సంఘం ఎన్నికల్లో ఎన్నికైన వారిని అభినందించిన ఎమ్మెల్యే జ్యోతుల

'రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరిస్తాం'

దేవీపట్నం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందుకూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ కుంజం మురళీ అధ్యక్షతన ఎంపీడీవో రత్నకుమారి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో రోడ్లు, తాగునీరు తదితర విషయాలను ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఏడు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో సమస్యలపై సోమవారం ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు.

పోశమ్మగండి ఆలయానికి భక్తుల తాకిడి

దేవీపట్నం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వయంభు మాతృశ్రీ గండి పోశమ్మతల్లి అమ్మవారి ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. వేకువజామునే గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

రంపచోడవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన గెద్దాడలో పురాతన శివాలయం శ్రీభ్రమరాంబికాసమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు, అర్చకుడు గోడవర్తి ప్రసన్న కుమార్‌శర్మఆధ్వర్యంలో నందీశ్వరుడు ప్రతిష్ఠ, రుద్రహోమాలు చేశారు.

ఘనంగా దత్త జయంతి

మోతుగూడెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం శ్రీసద్గురు సాయిబాబా ఆలయంలో దత్త జయంతి ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మూల విరాట్ దత్త విగ్రహానికి దత్త ఉత్సవ విగ్రహానికి కూడా పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఆలయకమిటీ వారు గ్రామస్తులు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. పీటీ రామారావు, కొట్టు శ్రీనివాసరావు, తామాడ త్రినాధ్‌రావు పాల్గొన్నారు.

ఆదివాసీలకు దుప్పట్లు పంపిణీ

చింతూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరా బాద్‌కు చెందిన సమరటెన్స్ ఫర్ ద నేషన్ సంస్థ ఆదివాసీ కుటుంబాలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ డైరక్టర్ పి. రాంకుమార్ మాట్లాడారు. ఆదివాసీ పేదలకు చలికాలంలో దుప్పట్లు అవసరం ఉంటుందన్న అభిప్రాయంతో దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. చింతూరు మండలంలోని పేగ, ఏడుగురాళ్ళపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని 18 గ్రామాలకు చెందిన 1600 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

మురారి దుర్గమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

గండేపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి గ్రామ శివారున వెలసిన దుర్గమ్మ తిరునాళ్ల రెండురోజుల ముందే భక్తులతో సందడిగా మారింది. ఈ ఆదివారం ఉమ్మడిజిల్లాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో సందడిగా మారింది. మంగళవారం జరగబోయే తిరునాళ్లకు కూడా భారీసంఖ్యలో తరలివచ్చే అవకాశాలు ఉండడంతో గండేపల్లి యువీ శివ నాగబాబు అన్నివిధాలా భద్రతాచర్యలు చేపడతామన్నారు. ఆలయకమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారికి ఆలయానికి వెళ్లే రహదారులు నీటితో తడిపారు. మంచినీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు.

వెండిచీరతో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



కిర్లంపూడి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ తల్లి ఆదివారం వెండిచీరతో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పెద్ద లు, భక్తులసహకారంతో ఏర్పాటుచేసిన వెండిచీర ఆదివారం పౌర్ణమి సందర్భంగా అలంకరించారు.

జె.కొత్తూరులో కనకదుర్గమ తీర్థం

జగ్గంపేటరూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె. కొత్తూరు గ్రామంలో కనకదుర్గ అమ్మవారి 39వ తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ మారిశెట్టి భద్రం, చల్లా రామ్మూర్తి, గంటపకిరు, అడపా తాతాజీ పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం

అన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో ఆదివారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. 9గంటలకు వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ యాగకర్తగా వ్యవహరించగా పండితులు ప్రత్యేకపూజలతో ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. ఈసందర్భంగా జపములు, పారాయణలు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను ఉంచి పూర్ణాహుతి గావించారు. పూర్ణాహుతిలో ఈవో వీర్ల సుబ్బారావు, సూపరింటెండెంట్‌లు ఐ.వి. రామారావు, మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి

తొండంగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసపౌర్ణమి సందర్భంగా ఆదివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెండపూడి సాయిబా బా ఆలయ ప్రాంగణంలో ఉన్న దత్తాత్రేయుని ఆల యంలో స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకులు పవన్‌శర్మ విశేష పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు కొంగర విశాలాక్షి, అన్నపూర్ణ, భ్రమరాంబ,కుమారిపాల్గొన్నారు.

తలుపులమ్మకు ముత్యాల హారం

తుని రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ క్షేత్రంలోని అమ్మవారికిముత్యాల హారాన్ని సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. కృష్ణా జిల్లా కానూరు గ్రామానికి చెందిన దండు వర్మరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఈ హారాన్ని ఆలయ పండితులకు అమ్మవారి ఎదుట అందజేశారు. ఈహారాన్ని అమ్మవారి ఆలంకరణలో వినియోగించాలని భక్తులు కోరారు. దాతలను ఆలయ పండితులు శేష వస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనాలు అందజేశారు.

లోవ ఆలయ నిర్మాణానికి రూ.92వేలు విరాళం

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకి చెందిన రవి హేమలీల, సల్మాన్‌రాజులు ఆలయ నిర్మాణానికి రూ.92వేలు విరాళం అందజేశారు. వీరిని ఆలయ పండితులు శేష వస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనాలు అందజేశారు.